'అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 1: అగ్నివీర్ వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ విజయనగరం ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.రామగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 6 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్, ఇంజినీరింగ్‌లో మూడు సంవత్సరాల డిప్లమో, రెండేళ్ల ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన యువతీ, యువకులు అర్హులని చెప్పారు. ఇతర వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నులకజోడులో బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్)



నాలుగున్నరేళ్లుగా నిర్లక్ష్యం



- సాగునీటి వనరులపై దృష్టి సారించని వైసీపీ సర్కారు
- టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులకు కలగని మోక్షం
- ప్రారంభానికి నోచుకోని ఎత్తిపోతల పథకాల నిర్మాణం
- నిలిచిన రిజర్వాయర్ పనులు.. వెనక్కిమళ్లిన నిధులు
- భామిని మండల రైతులకు తప్పని సాగునీటి కష్టాలు
- బోర్లు తీసేందుకు అప్పులు.. అదనపు భారంతో అవస్థలు

(భామిని)

'వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కోట్లాది రుపాయలు వెచ్చిస్తున్నాం.. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నాం..' ఇదీ వైసీపీ సర్కారు పదే పదే చెప్పే మాటలు. కానీ ఆచరణలో భిన్నంగా వ్యవహరిస్తోంది. క్షేత్రస్థాయిలో సాగునీటి సరఫరాకు కనీస చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత నాలుగున్నరేళ్లుగా సాగునీటి వనరుల పనులకు పెద్దగా నిధులు కేటాయించని వైసీపీ ప్రభుత్వం.. గత టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్ నిర్మాణంపైనా దృష్టి సారించ లేదు. కనీసం జలకళ పథంలోనూ బోర్లు మంజూరు చేయక పోవడంతో భామిని మండలంలో రైతులు సాగుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఏటా వరుణుడిపైనే ఆధారపడి పంటలు పండించాల్సిన దుస్థితి. పలు పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ సర్కారు మండలంలో సాగునీటి సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ఆ ప్రాంతవాసులు ప్రశ్నిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

భామిని మండలంలో వరి, పత్తి ప్రధాన పంటలు. ఏటా పది వేల ఎకరాలకు పైగా వరి, ఆరు వేల ఎకరాల్లో పత్తిని సాగు చేస్తుంటారు. ఈ ఏడాది 1500 ఎకరాల్లో మొక్కజొన్న కూడా వేశారు. అయితే పత్తి, మొక్కజొన్నకు పెద్దగా సాగునీరు అవసరం లేదు. వరికి వచ్చేసరికి ఇబ్బందులు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడంతో ఏటా రైతులు తలలు పట్టుకుంటున్నారు. వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపడుతున్నారు. గత ఖరీఫ్‌లో వర్షాలు పూర్తిగా కురవకపోవడంతో పంటలన్నీ ఎండిపోయాయి. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. అయితే వచ్చే ఖరీఫ్‌లో ఆ కష్టాలు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వంశధార నది నుంచి కాట్రగడ్డ, నేరడి బ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకాలు, భామిని సమీపంలో కొండలోయగెడ్డ వద్ద రిజర్వాయర్ పనులకు నిధులు మంజూరు చేశారు. అయితే ఇంతలో ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో ఎత్తిపోతల పథకాల నిర్మాణం ప్రారంభానికి నోచుకోకపోగా రిజర్వాయర్ పనులు ఆగిపోయాయి. దీంతో నిధులు వెనక్కి మళ్లాయి.

● ఇదిలా ఉండగా గత టీడీపీ ప్రభుత్వం.. భామిని మండలంలో రైతులకు సోలార్ సిస్టమ్ ద్వారా సుమారు వంద వ్యవసాయ బోర్లు మంజూరు చేసింది. ఐటీడీఏ ద్వారా అర్హులైన వారందరికీ వాటిని అందించారు. ఎస్సీ, ఎస్టీలు రూ.6 వేలు, బీసీ రైతులు రూ.30 వేలు చెల్లిస్తే.. రూ.5 లక్షల విలువ చేసే సోలార్ వ్యవసాయ బోరు ప్లాంట్‌ను కేటాయించారు. దీంతో కొన్నాళ్ల పాటు సాగునీటికి ఇటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. రైతులు సాఫీగా పంటలు పండించుకునేవారు. అయితే ఇటీవల కాలంలో అవి మరమ్మతులకు గురికాగా వాటిని బాగుచేసే వారే కరువయ్యారు. దీంతో ఆయా ప్లాంట్లు మూలకు చేరాయి. రైతులకు మళ్లీ సాగునీటి కష్టాలు మొదలయ్యాయి.

మరమ్మతు చర్యలేవీ..

వైసీపీ ప్రభుత్వం ఇప్పటికీ మండలంలో సాగునీటి వనరులపై శ్రద్ధ వహించడం లేదు. ప్రధానంగా వంశధార కాలువ నీరు భామినిలో వ్యవసాయ భూములకు మళ్లించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సోలార్ సిస్టమ్ వ్యవసాయ బోర్లకు మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో మండలంలో రైతులు అప్పులు చేసి సొంతంగా విద్యుత్ బోర్లు తీసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఒక్కో బోరుకు వారు రూ.లక్షా 50 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పించడం లేదు సరికదా కనీసం విద్యుత్ సదుపాయం కూడా అందించకపోవడంతో రైతన్నలు పెదవి విరుస్తున్నారు. గతేడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నులకజోడు, బాలేరు, బత్తిలి, గురండి, నేరడి, కీసర, కోసలి, బాలేరు తదితర గ్రామాల రైతులు బోర్లు ఏర్పాటు చేసుకుందుకు తహసీల్దార్‌కు దరఖాస్తులు చేశారు. అయితే వన్‌బీ వంటి ధ్రువపత్రాలు తీసు కురావాలని కొర్రీలు పెడుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరో వైపు కరెంట్ కనెక్షన్ కోసం విద్యుత్‌శాఖకు దరఖాస్తులు అందజేయగా.. చలా నా చెల్లించిన తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనాలు వేస్తామని ఆ శాఖాధికారులు చెబుతున్నారు. ఆ సొమ్మును చెల్లిస్తే మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామంటున్నారు. అయితే నాలుగు నుంచి ఐదు వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పా చేయాల్సి వస్తే అదనంగా రైతులే చెల్లించాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. దీంతో మండల రైతులకు ఇది అదనపు భారంగా మారింది.

ఏదీ జలకళ?

మండలం నుంచి జలకళ పథకానికి 2023, జనవరి నాటికి మొత్తంగా 370 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇప్పటివరకు ఒక్క బోరును కూడా మంజూరు చేయలేదు. అసలు నాలుగున్నరేళ్లలో మండలంలో ఒక్క బోరును కూడా ఆ పథకంలో కేటాయించలేదు. దీంతో రైతులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని సోలార్ సిస్టమ్ వ్యవసాయ బోర్లు

నీటి కోసం కష్టాలు..



కొండలోయగెడ్డ రిజర్వాయర్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గత ప్రభుత్వం రూ. ఆరు వేలకే రూ.5 లక్షల విలువ చేసే సోలార్ సిస్టమ్‌తో వ్యవసాయ బోరును మంజూరు చేశారు. దీంతో కొన్నాళ్లుగా సాగు సాఫీగా సాగేది. సాగునీటికి ఇబ్బందులు ఉండేవి కావు. అయితే వాటి సప్లయ్ బోర్డు మొరాయించడంతో అవి దేనికీ పనికిరాకుండా పోయాయి. ప్రస్తుతం సాగునీటికి కష్టాలు ఎదుర్కొంటున్నాం.

-బిడ్డిక ప్రసాద్, రైతు భామిని

తలకు మించిన భారం..



బోరు ఏర్పాటు చేయాలంటే తలకు మించిన భారమవుతుంది. గతంలో సోలార్ వ్యవసాయ బోరు ఏర్పాటు చేసినప్పటికీ అవి మరమ్మతులకు గురై మూలకు చేరాయి. ప్రస్తుతం రూ.లక్షా 20 వేల వరకు వెచ్చించి పొలాల్లో బోరు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. రూ.60 వేలు విద్యుత్‌శాఖకు చెల్లించగా మరో రూ.30 వేలతో మోటారు కొనాల్సి వస్తోంది. సుమారు రెండు లక్షలకు పైగానే ఖర్చు అవుతుంది. మా సమస్యలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు.

-ఎస్.భాస్కరరావు, రైతు, నులకజోడు


మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు

మూడు బోర్లుకు మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో బోరుకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. కాగా 11కేవీ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌కు నాలుగు నుంచి ఐదు స్తంభాలు ఏర్పాటు చేస్తే రైతులు అదనంగా చెల్లించాల్సిన అవసరం ఉంది. జనవరిలో 20 మినీ ట్రాన్స్‌ఫార్మర్ వరకు మంజూరయ్యాయి.

-శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఏఈ, భామిని

మన్యంపై మంచు దుప్పటి

- వాహన రాకపోకలకు అంతరాయం
- అపరాలు, వాణిజ్య పంటలకు అపార నష్టం



పాలకొండ-వీరఘట్టం దారిలో లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనాలు

పాలకొండ: మన్యాన్ని మంచు దుప్పటి కప్పేస్తోంది. కొద్ది రోజులుగా జిల్లాను దట్టంగా పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం ఎనిమిది గంటల వరకు ఇదే పరిస్థితి. జిల్లాలో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సామాన్య ప్రజలు సైతం ఆ సమయంలో బయటకు రాలేక పోతున్నారు. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడం లేదు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గురువారం ఉదయం 9 గంటల వరకు జిల్లాలో నాలుగు నియోజకవర్గాలతో అన్ని మండలాల్లోనూ ఈ పరిస్థితి కనిపించింది. సీతంపేట, గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీల్లో ఉదయం 11 గంటల వరకు పొగమంచు ఉండడంతో అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులపాలయ్యారు. చలి తీవ్రత కూడా అధికంగా ఉండడంతో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. ఇదిలా ఉండగా పొగ మంచుతో కూడిన ఆహ్లాదకర వాతావ రణం.. ప్రకృతి ప్రేమికులను మాత్రం విశేషంగా ఆకట్టుకుంటోంది.



పెసర, మినుము పంటలపై మంచు కురుస్తున్న దృశ్యం

● **పంటల పరిస్థితి ఇదీ..**

జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో సాగవుతున్న మినుములు, పెసర, ఇతర అపరాలపై పొగమంచు ప్రభావం పడుతోంది. పువ్వు, పిందె మాడిపోవడంతో పాటు చీడపీడలు కూడా ఆశ్రయిస్తున్నాయి. మరోవైపు పూత దశలో ఉన్న రెండున్నర లక్షల ఎకరాల్లో మామిడి, జీడిమామిడితో పాటు ఇతర వాణిజ్య పంటలు కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు.



పార్వతీపురంలో స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ నేతలు

7న లోకేష్ రాక

- జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన



పార్వతీపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. పార్టీ రాష్ట్ర వర్గాల సమాచారం మేరకు ఈ నెల 6న రాత్రి పాలకొండకు లోకేష్ చేరుకుని అక్కడే బస చేస్తారు. 7న ఉదయం పాలకొండ , మధ్యాహ్నం కురుపాం, సాయంత్రం పార్వతీపురం నియోజక వర్గాల్లో ఆయన పర్యటిస్తారు. 8న సాలూరుకు చేరుకుంటారు. ఆయా చోట్ల బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. అయితే ఇందుకు సంబంధించి సాలూరు, పాలకొండ, కురుపాం, పార్వతీపురంలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు గుమ్మిడి సంధ్యారాణి, నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో కార్యకర్తలు, నేతలు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచి నాయకులు వాటిని పరిశీలించి వెళ్లారు.

వలంటీరు తప్పిదం.. పింఛన్లకు దూరం

- పల్లపుసిరిపిలో 29 మంది గిరిజనులకు అందని డబ్బులు
- ఈనెల జాబితాలో వారికి దక్కని చోటు
- రూ. 2.90 లక్షలు కట్టాలని పంచాయతీ కార్యదర్శికి తాఖీదులు
- న్యాయం చేయాలంటున్న పింఛన్‌దారులు

(జియ్యమ్మవలస)

ఓ గ్రామ వలంటీరు తప్పిదంతో పింఛన్‌దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం వారంతా పింఛనుకు దూరమయ్యారు. ఇక మీదట పింఛను వస్తుందో రాదో తెలియని పరిస్థితి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆ గిరిజనులు కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఏజెన్సీ పంచాయతీల్లో పెదతోలుమండ (పీటీ మండ) ఒకటి. ఈ పంచాయతీలో పూర్తిగా ఆఫ్‌లైన్‌లోనే లావాదేవీలు జరపాల్సిన పరిస్థితి. దీని పరిధిలో పీటీ మండ, చాపరాయిగూడ, దీసరిగూడ, బాసన్నగూడ, కోడిపిల్లగూడ, నడిమిసిరిపి, పల్లపుసిరిపి గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో మొత్తంగా 211 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఓ వలంటీరు తప్పిదం వల్ల ఈ గ్రామంలో 29 మంది పింఛన్‌దారులకు జనవరి నెలలో పింఛన్లు అందలేదు. అంతేకాకుండా ఫిబ్రవరి నెలకు సంబంధించిన పింఛను జాబితాలోనూ వారి పేర్లు లేవు. దీంతో ఆ గ్రామ పింఛన్‌దారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో 16 వృద్ధాప్య, ఆరు దివ్యాంగ, ఆరు వితంతు, ఒక అభయహస్తం పింఛన్లు ఉన్నాయి. అయితే ఆయా పింఛన్లు అందకపోవడానికి ప్రధాన కారకుడు గ్రామ వలంటీరు అని సర్పంచ్ ఆరిక శారద, పింఛన్‌దారులు చెబుతున్నారు.

అసలేం జరిగిందంటే..

పీటీ మండ పంచాయతీ పల్లపుసిరిపి గ్రామ వలంటీరు పరిధిలో 29 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారికి 2023 అక్టోబరు, నవంబరు, డిసెంబరుకు సంబంధించి ఏ నెలకు ఆ నెల వలంటీరు ఆఫ్‌లైన్‌లో పింఛన్లు పంపిణీ చేశారు. అయితే ప్రతి నెలా పింఛన్‌దారులతో పాటు తన వేలిముద్ర కూడా వేయలేదు. దీంతో ఆన్‌లైన్‌లో ఆయా పింఛన్‌దారులు పర్మినెంట్ మైగ్రేషన్‌లోనికి వెళ్లిపోయినట్లు సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఈ కారణంగా జనవరికి సంబంధించి పింఛన్లు ఇవ్వకపోవగా.. అసలు ఈ నెలలో పింఛన్‌దారుల పేర్లు జాబితాలో కూడా కనిపించడం లేదు. ఇటీవల సెల్‌టవర్ ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు గిరిజనులు తమ గోడు వినిపించారు. మరి ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

● ఇదిలా ఉండగా గతేడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో ఆఫ్‌లైన్‌లో పింఛన్లు పంపిణీ చేయడంతో వాటి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించని పరిస్థితి. దీంతో రూ. 2.90 లక్షలు కట్టాల్సిందేనని గ్రామ సచివాలయ ఇన్‌చార్జి కార్యదర్శి ఆరిక ఆనంద్‌కు సెర్ప్ నుంచి తాఖీదులు రావడం గమనార్హం.

న్యాయం చేయాలి



జనవరి నెలలో నాకు మా వలంటీరు పింఛను ఇవ్వలేదు. నా జీవనానికి ఆ పింఛనే ఆధారం. ప్రస్తుత జాబితాలో మా పేర్లు లేవంటున్నారు. ఉన్నతాధికా రులు స్పందించాలి.

- మండంగి ముగతమ్మ, వృద్ధురాలు, పల్లపుసిరిపి

జాబితాలో పేరు లేదు



జనవరి నెలలో పింఛను ఇవ్వలేదు. ఫిబ్రవరి నెలకు ఇవ్వాల్సిన పింఛన్ జాబితాలో మా పేర్లు లేవు. ఇది చాలా అన్యాయం.

- బిడ్డిక పగడాలు, వృద్ధుడు, పల్లపుసిరిపి



పింఛన్లు రాలేదని గ్రామంలోనే నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం



పల్లపుసరిపి గ్రామంలో పింఛన్ల విషయం కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ, సెర్ప్ అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేశాం. ఒకట్రెండు రోజుల్లో అర్హుల పేర్లు డిస్‌ప్లే అవుతుందని చెబుతున్నారు. దీనికోసం ఎదురు చూస్తున్నాం.

- పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, జియ్యమ్మవలస



ధర్నా శిబిరంలో మాట్లాడుతన్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్

సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

- మున్సిపల్ ఉపాధ్యాయుల డిమాండ్
- ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన

బెలగాం, ఫిబ్రవరి 1: వైసీపీ ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని, సర్వీస్ రూల్స్ అమలు చేయాలని మున్సిపల్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ మాట్లాడుతూ.. మున్సిపల్ టీచర్లపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దశాబ్దాల కిందట ఏర్పడిన మున్సిపల్ పాఠశాలలను వైసీపీ సర్కారు విద్యా శాఖలో విలీనం చేయడంతో సమస్యలు అధికమయ్యాయని తెలిపారు. వాటిని పరిష్క రించకుండా దాటవేత ధోరణి అవలంబిస్తుండడం దారుణమన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలని, పీఎఫ్ ఖాతా తెరవాలని, ప్రత్యేకంగా మున్సిపాలిటీలకు ఎంఈవోలు, డీఈవో, బోధ నేతర సిబ్బందిని నియమించాలని, పదోన్నతులు కల్పించాలని యూనియన్ నాయకులు నినాదాలు చేశారు. ఈ నిరసనలో ఏపీటీఎఫ్ జిల్లా నేతలు నల్లా బాలకృష్ణ, ప్రమీల, ధనలక్ష్మి, జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

34 ఇరిగేషన్ పనులకు ప్రతిపాదనలు

రామభద్రపురం: మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఈ ఏడాది 34 పనులకు ప్రతిపాదనలు పంపించినట్టు ఇరిగేషన్ ఏఈ హరి తెలిపారు. సుమారు 3 కోట్ల 80 లక్షల విలువచేసే చెక్‌డ్యాంలు, మదుములు, ఇతర ఇరిగేషన్ పనులకు ఈ నిధులను వెచ్చిస్తామని తెలిపారు. ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపో నెంట్ ద్వారా ఈ పనులు చేపడతామన్నారు. అలాగే ఏడొంపుల గెడ్డ పరిధిలో కుడి, ఎడమ గట్ల మరమ్మతులకు కూడా రెండు కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.

లింగంపేటలో పశువైద్య శిబిరం

లక్కవరపుకోట: మండలంలోని లింగంపేట గ్రామంలో గురువారం మండల పశువైద్యాధికారి కే.గాయత్రి పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చూడీ పశువులను తనిఖీ చేసి ఉచితంగా మందులు అందజేశారు. పశుపోషణపై అవగాహన కల్పించారు. పశు సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా రైతులు ఎదగాలని కోరారు. సుమారు 56 పశువులను తనిఖీ చేసినట్లు తెలిపారు.

గిరిశిఖర గ్రామాలు సందర్శించిన ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర, దారపర్తి పంచాయతీ పరిధిలో వున్న పల్లపుదుంగాడ, పోర్లు, చిట్టంపాడు గ్రామాలను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, గ్రామపెద్దలతో కలిసి పర్యటించారు. చిట్టంపాడు వరకూ బైక్‌పై వెళ్లిన ఆయన అక్కడి నుంచి 15 కిలోమీటర్లు పాదయాత్ర ద్వారా గ్రామాలు చేరుకుని గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు విన్నారు. రోడ్డు సమస్యను ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి, కలెక్టర్ దృష్టిలో పెట్టామని, నిధులు కేంద్రప్రభుత్వం విడుదల చేసిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు.

టన్ను ఇనుము వితరణ

బొబ్బిలి: యూటీఎఫ్ నేత శేషగిరి స్మారకార్థం నిర్మించనున్న విజ్ఞాన కేంద్రం కోసం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన టన్ను ఇనుమును వితరణగా అందజేశారు. స్థానిక కోటలో గురువారం సాయంత్రం యూటీఎఫ్ మహిళానేత కె.విజయగౌరి తదితరులకు ఆయన చెక్కును అందజేశారు.

బొబ్బిలి సీహెచ్‌సీలో రక్తదాన శిబిరం

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 31 మంది యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. విజయనగరం జీజీహెచ్ సిబ్బంది శిబిరంలో సేవలందించారు. రక్తదాతలందరికీ డాక్టర్ శశిభూషణరావు సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు తదితరులు రక్తదాన శిబిరాన్ని సందర్శించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ

కొత్తవలస: మండలంలోని చింతలపాలెం గ్రామంలో జాతీయ కుష్ఠువ్యాధి నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తవలస పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్ఠువ్యాధిని నివారిద్దాం, నిర్మూలిద్దాం నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ నవీన్, ఉపసర్పంచ్ మజ్జి కనకేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు డీఎస్పీలు బదిలీ

విజయనగరం క్రైం/బొబ్బిలి: జిల్లాలో ఇద్దరు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీగా ఉన్న ఆర్ శ్రీనివాసరావును శ్రీకాకుళం దిశా పోలీసుస్టేషన్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాకుళం దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీ వాసుదేవ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బొబ్బిలి డీఎస్పీగా ఉన్న పి శ్రీధర్‌ను అన్నమయ్య జిల్లా సీసీఎస్ డీఎస్పీగా ఆయన స్థానంలో అనకాపల్లి డీటీసీ డీఎస్పీగా ఉన్న పి శ్రీనివాసరావును నియమించారు.

ఎంపీడీవోలకు బదిలీలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 1: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలోని పలువురు ఎంపీడీవోలకు బదిలీ అయింది. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఎంపీడీవోలకు ఇక్కడ పోస్టింగులు ఇస్తూ జిల్లా పరిషత్ సీఈఓ రాజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	కొత్తగా..
ఎం.పావని	శ్రీకాకుళం	మెరకముడిదాం
పి.చంద్రకుమారి	శ్రీకాకుళం	దత్తిరాజేరు
బి.మధుసూదనరావు	శ్రీకాకుళం	తెర్లాం
కె.ఫణీంద్రకుమార్	శ్రీకాకుళం	సాలూరు
ఎన్.రమేష్‌నాయుడు	శ్రీకాకుళం	బలిజిపేట
సీహెచ్ ఈశ్వరమ్మ	శ్రీకాకుళం	రామభద్రపురం
పి.సూర్యనారాయణ	శ్రీకాకుళం	గరుగుబిల్లి
బి.వెంకటరమణ	శ్రీకాకుళం	గుర్ల
ఎం ఈశ్వరరావు	శ్రీకాకుళం	గుమలక్ష్మీపురం
వి.తిరుమలరావు	శ్రీకాకుళం	జామి
ఎస్.హరిహరరావు	శ్రీకాకుళం	బొండపల్లి
కె.నిశ్చల	శ్రీకాకుళం	గరివిడి
ఎస్.రమణయ్య	శ్రీకాకుళం	కొత్తవలస
హెచ్.శశిభూషణరావు	శ్రీకాకుళం	వేపాడ
డి.శ్వేత	శ్రీకాకుళం	చీపురుపల్లి
పి.జయంత్ ప్రసాద్	శ్రీకాకుళం	గజపతినగరం
సీహెచ్ లక్ష్మీబాయి	శ్రీకాకుళం	మెంటాడ
ఎ.లవరాజు	విశాఖపట్నం	డెంకాడ
ఎ.సాంబశివరావు	విశాఖపట్నం	ఎస్.కోట
జి.చంద్రకళ	విశాఖపట్నం	భోగాపురం

ఆర్ఎస్ఐలకు స్థాన చలనం

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 1: జిల్లాలో పలువురు ఆర్ఎస్ఐలను కూడా బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి బదిలీలు చేపడుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుతం	కొత్త ప్రాంతం
టి.రామారావు	విశాఖ సిటీ	విజయనగరం జిల్లా
బాలి సూర్యనారాయణ	విశాఖ సిటీ	విజయనగరం జిల్లా
బలగ తిరుపతిరావు	విశాఖ సిటీ	విజయనగరం
ఆయితిరెడ్డి మంగలక్ష్మీ	విశాఖ సిటీ	విజయనగరం
బి.ప్రసాద్‌రావు	విజయనగరం	అనకాపల్లి
వి నారాయణరావు	విజయనగరం	విశాఖ సిటీ
వి.కేశవరావు	విజయనగరం	అనకాపల్లి
ఎస్.అక్షయకుమార్	విజయనగరం	శ్రీకాకుళం
టి.నీలిమ	విజయనగరం	శ్రీకాకుళం
జి.విజయ్‌కుమార్	విజయనగరం	విశాఖ సిటీ
ఎల్.శ్రీనివాసరావు	విజయనగరం	విశాఖ సిటీ
ఎ.రామకృష్ణ	విజయనగరం	విశాఖ సిటీ
కె.వరప్రసాద్	శ్రీకాకుళం	విజయనగరం
ఎండీ ముబారక్ అలీ	శ్రీకాకుళం	విజయనగరం
సీహెచ్ మహేష్	అనకాపల్లి	విజయనగరం
డి.గోపాలరావు	అనకాపల్లి	విజయనగరం

ధరల నియంత్రణ ఏదీ?

- టీడీపీ వస్తే అందరికీ అందుబాటులో ధరలు
- 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో ఆ పార్టీ నాయకులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 1: నాలుగున్నరేళ్లుగా నిత్యావసర, కాయగూరల ధరలు పెరుగుతూ వచ్చాయని, ధరలు నియంత్రిస్తామన్న జగన్మోహన్‌రెడ్డి హామీ హామీగానే మిగిలిందని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు చెప్పారు. 24, 25 డివిజన్లలో జరిగిన 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆమె ఆయా డివిజన్లలో ఇంటింటికీ తిరిగారు. టీడీపీ నాయకులు గొల్లకోటి హారిక, గొల్లకోటి గురునాథ్, గొల్లకోటి శివ ఆధ్వర్యంలో భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే, ధరలు నియంత్రణ సాధ్యమౌతుందన్నారు. టీడీపీ నగర, మండల కమిటీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




విజయనగరం: ప్రచారంలో అదితి గజపతిరాజు, గంట్యాడలో టీడీపీ నాయకుల ప్రచారం

గంట్యాడ: నరవ గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నాలుగున్నర సంవత్సర కాలంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీ పీ నాయకులు బూడి అప్పలనాయుడు, సుంకరి రామునాయుడు, సన్యాసప్పుడు, సాయికృష్ణ,బంగారాజు పాల్గొన్నారు.

చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో గురువారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమి డి నాగార్జున పాల్గొని, మాట్లాడారు. వైసీపీకి నూకలు చెల్లిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, దన్నాన సూరపునాయుడు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, ఆరతి సాహు, సబ్బి సోనియా, గంట్యాడ సత్యనారాయణ, గడే సన్యాసప్పలనాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీ నాయన, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. పెదంకలాం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల్ నాయుడు, గొట్టాపు వెంకటినాయుడు, పోల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాంగా సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్ అన్నారు. గురువారం పార్వతీపురంలోని ఐదో వార్డులో టీడీపీ సీనియర్ నాయకుడు కోలా మధు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల వియచంద్ర ఆదేశాలతో ఈకార్య క్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్వతీపురంలో టీడీపీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సహారా బాధితుల ర్యాలీ

బొబ్బిలి, ఫిబ్రవరి 1: సహారా ఇండియా ఖాతాదారులకు చెల్లింపులు జరపకపోవడాన్ని నిరసిస్తూ బాధితుల సంఘం గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డిపాజిట్లు చేసి మోసపోయిన వారంతా కలిసి 12 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని ఆ సంఘం ప్రతినిధులు బీఎల్‌దాసు, వైఏ నాయుడు వాపోయారు. కేంద్ర ప్రభుత్వం, సీఆర్‌సీ కలిసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. డిపాజిట్ చేసిన వారిలో 80 శాతం మందికి పైగా పేద, బడుగువర్గాలకు చెందినవారేనని, రోజువారీ కూలీనాలీ చేసుకొని తమ పిల్లల భవిష్యత్‌కోసం కడుపుకట్టుకొని మరీ పొదుపు చేసుకున్నారని, అలాంటి వా రంతా ఇప్పుడు లబోదిబోమంటున్నారన్నారు. బాధితులను ప్రభుత్వాలు ఆదు కోవాలని వారు డిమాండ్ చేశారు.

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో గురువారం సహారా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సంస్థ చేస్తున్న అన్యాయాలపై పోరాటానికి అనుమతి ఇవ్వాలని ఎస్.ఐ.గంగరాజుకు వినతిపత్రం అందించారు. సంస్థ చేసిన అవకతవకలతో ఏజెంట్లు, ఖాతాదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నామని వివరించారు.




బొబ్బిలి, ఎస్‌కోటలో ర్యాలీ చేస్తున్న సహారా బాధితులు

ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి

బొబ్బిలి, ఫిబ్రవరి 1: విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ డివి జన్ స్థాయి సమావేశం గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు ఎస్.లక్ష్మణ మాట్లాడుతూ ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైరైన వారికి సకాలంలో పెన్షన్లు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అ నంతరం జరిగిన ఎన్నికల్లో సూరిని అధ్యక్షునిగా, సత్యారావు, దేముడులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

నిరుద్యోగులకు అన్యాయం చేశారు

కలెక్టరేట్, ఫిబ్రవరి 1: పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కుదించి మెగా డీఎస్సీ అని చూపించడం దారుణమని యూటీఎఫ్ నాయకులు ఆరోపించారు. యుటీఎఫ్ ఆధ్వర్యంలోని కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు గురువారం కొనసాగించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ డీఎస్సీ అని చెప్పి 6100 పోస్టులు చూపించడం చాలా దారుణమని, వేల పోస్టులు ఖాళీగా ఉన్న ఈ విధంగా పోస్టులు తగ్గించడం నిరుద్యోగులకు అన్యాయం చేయడమే అని ఆరోపించారు. రాష్ట్రంలో పని చేస్తున్న నాలుగు లక్షల మంది ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయకుండా ఉద్యోగులు కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆరోపించారు. ఉద్యోగులకు రావల్సిన పీ ఎఫ్, ఏపీజీఎల్ రుణాలు, పార్ట్ పేమెంట్లు, సరెండర్ లీవులు, పీఆర్‌సీ ఎరియర్స్, డీఏ బకాయిలు రూ.18,000 కోట్లు ఇవ్వవల్సి ఉండగా, రూ 1200 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. సంఘ నాయకులు త్రినాద్, ప్రసాద్‌రావు, రామినాయుడు, నిర్మల, రమణ, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.



నిరసన దీక్షలో యూటీఎఫ్ నాయకులు

బాలలతో స్నేహపూర్వకంగా ఉండాలి

విజయనగరం దాసన్నపేట: పిల్లలతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. గురువారం కస్పా స్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమై, బాలల చదువు-భద్రత-రక్షణ-సంరక్షణపై చర్చించారు. హెచ్‌ఎం శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిమెంట్ లెక్కలపై పీడీ ఆరా

రేగిడి, ఫిబ్రవరి 1: మండలంలో లెక్క తప్పిన సిమెంట్ వ్యవహారంపై డీఆర్‌డీఏ పీడీ, మండల పరిషత్ ప్రత్యేకాధికారి కల్యాణ చక్రవర్తి ఎట్టకేలకు దృష్టి సారించారు. పీఆర్ ఏఈ రామకృష్ణ ఈ వ్యవహారంలో అధికారులు, నేతల ఒత్తిళ్లతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అభియోగాలు ఉన్న సంగతి తెలిసిందే. అసలు ఏం జరిగిందనే దానిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో శ్యామలాకుమారి, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్షించారు. ఒక్కో సచివాలయానికి ఎంత సరఫరా అయింది? భవనాల ప్రగతి, ఇతర సచివాలయాలకు సర్దుబాటైన వివరాలు ఇంజి నీరింగ్ అసిస్టెంట్‌ల నుంచి సేకరించినట్లు పీడీ వెల్లడించారు. అప్పట్లో భవన నిర్మాణాల ప్రగతి పెద్దగా లేకపోగా, సిమెంట్ పాడవుతుందనే ఉద్దేశంతో ఒక సచివాలయం నుంచి ఇతర సచివాలయాలకు సర్దుబాటు చేసినట్టు పీడీ గుర్తించారు. ఇది సక్రమంగా జరగలేదని అందరికీ తెలిసిందే అని నర్మగ ర్భంగా వ్యాఖ్యానించారు. మండలంలో ఒకటి రెండు చోట్ల గడ్డలు కట్టి వందలాది సిమెంట్ బస్తాలు పాడవడం, భవనాలు మంజూరై మూడేళ్ల గడిచినా, కొన్ని చోట్ల నిర్మించకపోవడం... కొన్నిచోట్ల అనధికార సర్దుబాట్లుపై పీడీని ప్రశ్నంచగా అన్ని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు స్థానిక నేతలు, వైస్ ఎంపీపీలు టెంకాల అచ్చంనాయుడు, వి.జగన్మోహనరావు, వ్యవసాయ బోర్డు సలహా మండలి అధ్యక్షులు గేదెల వెంకటేశ్వరరావుతో సమావేశమై ఈనెల 5న నిర్వహించనున్న ఆసరా సమావేశంపై చర్చించారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

శృంగవరపుకోట, ఫిబ్ర వరి 1: కార్యకర్తలకు తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి, మా జీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శృంగవరపుకోట పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త గనివాడ అప్పారావుకు ప్రమా దం జరగడంతో నడవలేకపోతున్నాడు. దీంతో గురువారం ట్రైసైకిల్, ఖర్చులకు రూ.5వేలు అందించారు. మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, విశాఖ పార్లమెంటు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్క కిరణ్ కుమార్, నాయకులు మోపాడ చిన్ని కృష్ణ, భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, గనివాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ట్రై సైకిల్ అందిస్తున్న కోళ్ల లలిత కుమారి

ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి

దాసన్నపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని ఇన్ఫోసిస్‌లో ప్రముఖ ఆర్కిటెక్చర్, డేటా, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నిపుణుడు(అమెరికా) మట్టా దినేష్ అన్నారు. నగరంలోని తోటపాలెంలో ఉన్న ఎయిమ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులు ఉన్నత జీవితానికి సంబంధించి ఎయిమ్ విద్యాసంస్థల చైర్మన్, ప్రముఖ వ్యాపార వేత్త కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి దినేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి విద్యార్థులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పారు. అనంతరం మట్టా దినేష్‌ను కడగల ఆనంద్‌కుమార్‌తో పాటు పాఠశాల పరిపాలన అధికారి బాలాజీ, సురేష్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మట్టా దినేష్

పట్టణానికి దూరంగా ఆసరా సదస్సా?

రాజాం/రూరల్: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధిలో శుక్రవారం ఆసరా సదస్సు నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయడంపై డ్వాక్రా సంఘాల మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గతానికి భిన్నంగా పట్టణంలో సదస్సు నిర్వహించకుండా పట్టణానికి దూరంగా నిర్వహించే సదస్సుకు సభ్యులంతా హాజరు కావాలని ఆదేశించడంపై అధికారుల తీరును మహిళలు విమర్శిస్తున్నారు. రాజాం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును పట్టణం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని అంతకాపల్లిలో నిర్వహించడం, ఇక్కడకు ఇతర గ్రామీణ ప్రాంతాల నుంచి గరిష్ఠంగా పది నుంచి 15 కిలోమీటర్లు దూరం ఉండడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మార్కెట్ యార్డులో సదస్సు నిర్వహించేవారని అధికారుల తాజా నిర్ణయంతో మరో అయిదారు కిలోమీటర్లు వెళ్లాల్సి రావడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జియ్యమ్మవలస: మండలంలో బిత్రపాడు గ్రామానికి చెందిన కొప్పర నీలిమ(22) అదృశ్యమైనట్లు ఆమె భర్త కొప్పర దాలిగురువులు చినమేరంగి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. జనవరి 30న ఉదయం కాలకృత్యాలు తీర్చుకుంటానని చెప్పి వెళ్లిపోయి తిరిగి రాలేదని తెలిపారు. నీలి రంగు టాప్, బిస్కట్ కలర్ ప్యాంటు వేసుకొని ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన ఏఎస్ఐ పత్రిక కాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆచూకీ తెలిసిన వారెవరైనా చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సెల్ నెంబరు 91211 09478కు గాని, ఫిర్యాది దాలిగురువులు సెల్ నెంబరు 95819 45489కు గాని తెలియజేయాలని ఆయన కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామభద్రపురం: మండల పరిధిలోని ఇట్లామామిడిపల్లి గ్రామంలో పోలీసులు జరిపిన దాడుల్లో అయిదుగురు పేకాటరాయుళ్లను అరెస్టుచేసి వీరి నుంచి రూ.53 వేల 260లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: మండలంలో తునివాడ గ్రామంలో గురువారం రాత్రి స్థానిక పోలీసులు ఎన్నికల విధుల్లో భాగంగా నిర్వహించిన సోదాల్లో ఒక బెల్ట్‌షాపు నిర్వాహకుడి నుంచి 30 మద్యం సీసాలు పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బెల్ట్‌షాపులో మద్యం విక్రయాలు చేస్తుండగా, నిందితుడ్ని పట్టుకొని అరెస్టు చేశామని, స్టేషన్‌బెయిల్‌పై విడుదల చేశామని ఆయన తెలిపారు.

స్థానిక వ్యక్తికే టికెట్ ఇవ్వాలి

- ఎమ్మెల్సీ రఘురాజు డిమాండ్

లక్కవరపుకోట, ఫిబ్రవరి 1: శృంగవరపుకోట నియోజకవర్గ వైసీపీ టికెట్ స్థానిక నేతలకు ఇవ్వాలని ఎమ్మెల్సీ రఘురాజు డిమాండ్ చేశారు. గురువారం ఎల్.కోటలోని సూరితాత కల్యాణ మండపంలో నియోజకవర్గ వైసీపీ క్రియాశీలక కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పార్టీలో జరిగిన కీలక విషయాలను కార్యకర్తలతో పంచుకున్నారు. పార్టీలో ఉన్నత వ్యక్తుల పేర్లు వాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఇన్నా ళ్లూ గడిపారని విమర్శించారు. మెజార్టీ మండలాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతిని ధులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న 5 మండలాల్లో గల బీసీ నేతల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా కష్టపడి పనిచే స్తారని రఘురాజు తెలిపారు. ఈ సందర్భంగా పలువురి పేర్లను ప్రస్తావించారు. డాక్టర్ దిలీప్ కుమార్, నాయుడుబాబు, సతీష్, శ్రీదేవి, రాజేశ్వరరావు, వెంకట లక్ష్మి, స్వప్న తదితర పేర్లను సూచించారు. కేడర్ లేకుండా ఎన్నికలకు వెళ్లలే మని రఘురాజు పేర్కొన్నారు. సూరితాత మాట్లాడుతూ కడుబండికి టికెట్ ఇస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించబోమని ప్రకటించారు. కొత్తవలస జెడ్పీటీసీ శ్రీదేవి, వేపాడ ఎంపీపీ సతీష్, ఎస్.కోట నేతలు సుధారాజు, వెంకటలక్ష్మి, రామ న్న పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

మిడతాన జన్మదిన వేడుకలు

- ప్రేమ సమాజంలో రెండు పూటలా భోజన ఏర్పాట్లు

విజయనగరం, ఫిబ్రవరి 2: విజయనగరం పట్టణంలోని ప్రేమ సమాజంలో రవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు.. జనసేన పార్టీ జిల్లా నాయకులు మిడతాన రవికుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం ప్రేమ సమాజంలోని అవ్వలకు, తాతలకు భోజన ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా వారితో కలిసి భోజనం చేశారు. ప్రేమ సమాజంలోని వృద్ధులే తన తల్లిదండ్రులుగా భావిస్తున్నానని వెల్లడించారు. తన పుట్టిన రోజున అవ్వ.. తాతలతో గడపడం తనకు ఎంతో సంతోషాన్ని సంతృప్తినిచ్చిందన్నారు. ప్రేమ సమాజంలోని అవ్వ తాతలందరికీ మధ్యాహ్నం, రాత్రికి భోజన ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.



ప్రేమ సమాజంలో మిడతాన రవి

అంతలోనే మారిన ఉత్తర్వులు

యథాస్థానంలో ఎస్.కోట తహసీల్దార్

విజయనగరం కలెక్టరేట్: తహసీల్దార్లను బదిలీ చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులు కొన్ని గంటల వ్యవధిలోనే మారిపోయాయి. మెంటాడ తహసీల్దార్‌గా బదిలీ చేసిన ఎస్.కోట తహసీల్దార్ డి.శ్రీనివాసరావును యథాస్థానంలో వుంచేశారు. శృంగవరపుకోట తహసీల్దార్‌గా నియమించిన అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ తహసీల్దార్ వి.త్రినాథరావునాయుడును మెంటాడ తహసీల్దార్‌గా మార్చారు. గురువారం మధ్యాహ్నం 1గంట సమయంలో తహ సీల్దార్‌ల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను కలెక్టర్ నాగలక్ష్మి విడుదల చేశారు. ఆ వివరాలు రెవెన్యూ అధికారుల వాట్సాప్‌లో చక్కెర్లు కొట్టాయి. ఏ మైందో ఏమో కాని రాత్రి 9గంటల సమయంలో ఆ ఉత్తర్వుల్లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. అర్డర్(ఉత్తర్వు)లో ఈ ఇద్దరు తహసీల్దార్‌ల బదిలీకి సం బంధించి మార్పులు చేశారు. ఈ విషయం కలెక్టరేట్‌లో చర్చకు దారి తీసింది. జిల్లా వ్యాప్తంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తహసీల్దార్లకు మండలాల కేటాయింపు

కలెక్టరేట్, ఫిబ్రవరి 1: సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై జిల్లాకు వచ్చిన తహసీల్దార్లకు మండలాల వారీగా పోస్టులు కేటాయిస్తూ కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జిల్లా నుంచి శ్రీకాకుళం, విశాఖకు బదిలీ అయిన తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కూడా ఉత్తర్వులు ఇచ్చారు. గుర్ల మండలానికి అక్కడి సీఎస్‌డిటికి, విజయనగరం మండలానికి అక్కడి ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ జి.రామును కలెక్టరేట్ పరిపాలన అధికారిగా నియమించారు.

తహసీల్దార్ పేరు	పనిచేసిన చోటు	కేటాయించిన పోస్టు
జి.రాంబాయి	తహసీల్దార్, అనంతగిరి	జామి తహసీల్దార్
వి.త్రినాద్‌రావునాయుడు	తహసీల్దార్, డుంబ్రిగుడ	మెంటాడ తహసీల్దార్
సీహెచ్‌వీ సురేష్	తహసీల్దార్, భీమిలి	గజపతినగరం తహసీల్దార్
ఎస్.రమణయ్య	తహసీల్దార్, విశాఖపట్టణం	బొండపల్లి తహసీల్దార్
పి.శ్యామ్‌ప్రసాద్	తహసీల్దార్, పెందుర్తి	భోగాపురం తహసీల్దార్
పి.రమాదేవి	తహసీల్దార్, పెదగంట్యాడ	గుర్ల తహసీల్దార్
ఎ.శ్రీనివాసరావు	ఏవో, కలెక్టరేట్, అనకాపల్లి	ఏవో కలెక్టరేట్
సీహెచ్ చంద్రశేఖర్ రావు	ఏవో, ఆర్‌డీవో ఆఫీస్, అనకాపల్లి	కొత్తవలస తహసీల్దార్
వీవీ రత్నం	తహసీల్దార్, వి.మాడుగుల	విజయనగరం తహసీల్దార్
ఎం.సురేష్‌కుమార్	పర్యవేక్షకులు, కలెక్టరేట్ శ్రీకాకుళం	సి.సెక్షన్ పర్యవేక్షకులు కలెక్టరేట్
ఎన్.ప్రసాద్‌రావు	ఏవో, ఆర్‌డీవో ఆఫీస్ శ్రీకాకుళం	చీపురుపల్లి తహసీల్దార్
కె.విజయలక్ష్మి	తహసీల్దార్, కెఆర్ఆర్‌సి శ్రీకాకుళం	కేఆర్ఆర్‌సీ తహసీల్దార్ కలెక్టరేట్
జె.రామారావు	తహసీల్దార్, గార	డెంకాడ తహసీల్దార్
బి.సత్యం	తహసీల్దార్, జలుమూరు	గరివిడి తహసీల్దార్
ఎన్.హనుమంతురావు	తహసీల్దార్, సారవకోట	ఏవో ఆర్‌డీవో ఆఫీస్, విజయనగరం
ఎస్.కిరణ్‌కుమార్	తహసీల్దార్, రణస్థలం	బొబ్బిలి తహసీల్దార్
ఎస్.దిలీప్ చక్రవర్తి	తహసీల్దార్, లావేరు	తెర్లాం తహసీల్దార్
కె.ప్రవళిక ప్రియ	తహసీల్దార్, టెక్కలి	పూసపాటిరేగ తహసీల్దార్
వైవీ పద్మావతి	తహసీల్దార్, నందిగాం	మెరకముడిదాం తహసీల్దార్
పి.శేఖర్	తహసీల్దార్, కవిటి	పర్యవేక్షకులు, ఇ-సెక్షన్ కలెక్టరేట్
సీహెచ్ తిరుమలరావు	తహసీల్దార్, కొయ్యూరు	రేగిడి తహసీల్దార్
జె.రాములమ్మ	తహసీల్దార్, జీఎల్ పురం	సంతకవిటి తహసీల్దార్
ఎస్.రాజారావు	తహసీల్దార్, ఆర్‌బీ పురం	బాడంగి తహసీల్దార్
ఏ.సులోచరాణి	తహసీల్దార్, సంతకవిటి	ఆర్‌బీపురం తహసీల్దార్
బి.సుదర్శనరావు	తహసీల్దార్, రేగిడి	దత్తిరాజేరు తహసీల్దార్
డి.ఇస్సాక్	తహసీల్దార్, వంగర	ఏవో చీపురుపల్లి, ఆర్‌డీవో ఆఫీస్
ఎం.ప్రభాకర్‌రావు	ఏవో, ఆర్‌డీవో కార్యాలయం	పర్యవేక్షకులు హెచ్-సెక్షన్ కలెక్టరేట్
డిఎంజిఎస్ ప్రసాద్‌రావు	తహసీల్దార్, బొండపల్లి	ఎల్‌కోట తహసీల్దార్
కె.సుధాకర్	ట్రైనీ తహసీల్దార్	వంగర తహసీల్దార్

బీటీ రోడ్డు ప్రారంభం

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని 25వ డివిజన్ రామారాయుడు రహదారిలో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధే ధ్యేయంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ రహదారిని నిర్మించినట్టు తెలిపారు. త్వరలోనే ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సెంటర్లో మహాత్మాగాంధీ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చి లయ యాదవ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అంతుపట్టని మిస్సింగ్స్

- రాజాంలో పెరుగుతున్న కేసులు

రాజాం రూరల్: ఇటీవల కాలంలో రాజాం పోలీ స్ స్టేషన్ పరిధిలో మిస్సింగ్ కేసులు పెరిగిపోతున్నాయి. ఇది పోలీ సులకు శిరోభారం కాగా... కుటుంబాల పరిస్థితి అయోమయంగా మారుతోంది. ఆరేళ్ల పిల్లల నుంచి అరవయ్యేళ్ల వృద్ధుల వరకూ తరచూ ఎక్కడో ఓచోట మిస్ అవుతున్నారంటూ పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఫలితంగా పోలీసు రికార్డుల్లో మిస్సింగ్ కేసుల సంఖ్య పెరిగిపోతోంది. ఇంటి నుంచి వెళ్లిన వారిలో నాలుగైదు రోజుల్లో తిరిగి వస్తున్న సంఘటనలూ ఉన్నాయి.

ఇవీ కేసుల వివరాలు..

- పట్టణంలోని కూరాకులవీధికి చెందిన పెద్ది వెంకటేశ్ (35) ఈనెల 20న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తల్లి శార్వాణి 24న రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.ఐ. రవికిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- గతేడాది డిసెంబరు 8న ఇక్కడి తెలగావీధిలో ఉంటున్న తన 17 ఏళ్ల కుమార్తె కనిపించడం లేదని బలిజిపేట మండలం శ్రీరంగరాజపురానికి చెందిన తండ్రి కోనారి దుర్గారావు రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- పాలకొండ మండలం బాసూరు గ్రామానికి చెందిన 21 ఏళ్ల వివాహిత తన అత్తతో గతేడాది డిసెంబరు 26న రాజాంలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు వచ్చి కనిపించకుండాపోయింది. ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మద్యం తాగొద్దని భార్య మందలించిందని పట్టణంలోని మెంతిపేట ఎస్సీ కాలనీకి చెందిన 55 ఏళ్ల మూతి సోములు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు భార్య గౌరమ్మ డిసెంబరు 30న ఫిర్యాదు చేసింది.
- సెల్‌ఫోన్ అతిగా చూడొద్దని తల్లిదండ్రులు మందలించారని పట్టణంలోని వస్త్రపురికాలనీకి చెందిన 17 ఏళ్ల యువకుడు అంకిత్‌మిశ్రా ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు కేసు నమోదైంది.
- శ్రీకాకుళం వెళ్తొస్తానని చెప్పి మారేడుబాకకు చెందిన ప్రవీణ్ కుమార్ (31) ఈనెల 6న ఇంటి నుంచి వెళ్లి.. తిరిగి రాలేదని తల్లి సూరీడమ్మ రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కమిషనర్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయచంద్ర డిమాండ్



మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన రామప్పనాయుడు అనేక అక్రమాలకు పాల్పడ్డారని, వాటిపై దర్యాప్తునకు ఉన్నతాధికారులతో కమిషన్ నియమించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తుపాను నిధులు పక్కదారి పట్టాయని ఆరోపించారు. కేవలం కాలువపై కప్పులుతీసి పూడ్చేందుకు రూ.16 లక్షలు ఖర్చయినట్టు చెప్పారని తెలిపారు. పాత తేదీలతో సతకాలు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, పి.సత్యనారాయణ, బోనుదేవి చంద్రమౌళి, మజ్జి వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌కు సర్వర్ సమస్య

● తలలు పట్టుకుంటున్న రెవెన్యూ సిబ్బంది



ఉల్లిభద్రలో సర్వర్ సమస్యతో నిరీక్షణ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

గరుగుబిల్లి: లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సచివాలయాల్లో సర్వర్ సమ స్య నెలకొనడంతో రెవెన్యూ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. తహసీల్దార్ల బదిలీ సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి వీరిలో నెలకొంది. మండలంలోని 13 సచివాలయాల్లో 476కు పైగా లేఅ వుట్లలో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. అయితే గతంలో పట్టాలు పొందిన వారు నేటి కీ నిర్మాణాలు చేపట్టలేదు. నిర్మాణాలు చేపట్టకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నిస్తున్నారు. పలు గ్రామాల పరిధిలోని లబ్ధిదారులు రిజిస్ట్రేషన్‌కు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రావుపల్లి, గొట్టివలస, పెదగుడబ, రావివలస సచివాలయాల్లో 28 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. నమోదుకు ఈనెల 9వ తేదీ వరకు సమయం ఉన్నా ఉన్నతాధికారులు రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ అధికారులు పరుగులు తీస్తున్నారు. తహసీ ల్దార్ జీవీ జనార్దన్‌తో పాటు ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణ వీఆర్వోలను అప్రమత్తం చేస్తున్నారు. అలాగే నమోదు ప్రక్రియను సచివాలయాలకు వెళ్లి స్వయంగా పరిశీలన చేస్తున్నా సర్వర్ సమస్యతో ముందుకు సాగడం లేదు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణం, రీసర్వే తదితర పథకాలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జేసీ గోవిందరావు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ శతశాతం పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి బి.జగన్నాథరావు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం కృషి చేయాలి



లలితాదిత్యను సన్మానిస్తున్న ఆర్డీవో

చీపురుపల్లి: విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించడానికి కృషి చేయాలని చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి అన్నారు. పట్టణంలో గురువారం జరిగిన గాయత్రీ జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇదే కళాశాలలో చదివి ఎస్ఐగా ఎంపికైన సీహెచ్ లలితాదిత్య, డీసీసీబీ బ్యాంకు మేనేజరుగా ఎంపికైన జి.భారతిలను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ హెచ్.ఉపేంద్రకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ దాసరి శివప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనోపాధిపై ట్రైనీ కలెక్టర్ ఆరా

గంట్యాడ: తాటిపూడి రిజర్వాయర్ అవలఉన్న డీకే పర్తి గ్రామాన్ని ట్రైనీ కలెక్టర్ బీఎస్ వెంకట్ త్రివినాగ్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఏకో టూరిజం వద్ద గిరిజనులను కలిసి, వారి జీవన విధానాలు, జీనవో పాధిపై ఆయన అడిగి తెలుసుకున్నారు. ఐఏఎస్ శిక్షణలో భాగంగా ఆయన వారితో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆసరా కార్యక్రమానికి ఉపాధి కూలీలు

● నేడు పనికి సెలవు

మెంటాడ: ఆసరా కార్యక్రమానికి ఉపాధి కూలీలను తరలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. శుక్రవారం కైలాం గ్రామం వద్ద ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత కానరావడం గ్రహించిన నేతలు కార్యక్రమం విఫలం కాకుండా ప్రయత్నిస్తున్నారు. మండలంలో సుమారు 4వేల మంది ఉపాధి వేతనదారులు పనిచేస్తున్నారు. ఆసరా కార్యక్రమం ఉన్నందున శుక్రవారం ఉపాది పనికి సెలవు ప్రకటించారు. వారందరినీ ఆసరా కార్యక్రమానికి తరలించే బాధ్యత వలంటీర్లు, వెలుగు, ఉపాధి హామీ సిబ్బందికి అప్పగించారు. ఈ కార్యక్రమానికి రావట్లేదని చెప్పినవారికి వివిధ రకాల బెదిరింపులు వస్తున్నాయని వేతనదారులు ఆవేదన వ్యక్తంచేశారు.

'కొప్పలవెలమలకు అన్యాయం'

బొబ్బిలి: కొప్పలవెలమ సామాజిక వర్గానికి రాజకీయ పదవుల్లో సముచిత స్థానం లభించడం లేదని ఆ సంఘ రాష్ట్ర నాయకుడు కిలపర్తి పరదేశినాయుడు, జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వెలమ వారి ఫంక్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. విజయనగరం ఎంపీ, బొబ్బిలి, గజపతినగరం ఎమ్మెల్యే స్థానాలను కొప్పలవెలమ సామాజిక వర్గాలకు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీల అధినేతలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపీ పదవులు వేరే సామాజిక వర్గం వారికి ఇచ్చినందున ఈసారి ఎన్నికల్లో తమ వర్గానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును కలిశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు మేళావు శ్రీహరినాయుడు, కర్రి సత్యనారాయణ, గొట్టాపు కృష్ణమూర్తి, మరడ అప్పారావు, కేతిరెడ్డి కృష్ణమూర్తి, బలగ సాయికృష్ణ, కొరిపల్లి రమణయ్య, కొల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో అప్రంటీస్ విధానం వద్దు

బొబ్బిలి: ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ నాయకుడు జేసీ రాజు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లా కౌన్సిల్ సమావేశాలకు సంబంధించి మండల బాధ్యులకు సీనియర్ నేత బి.జోగి నాయుడు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ రాజు మాట్లాడుతూ గతంలో అనేక పోరాటాలతో అప్రంటీస్ విధానాన్ని రద్దు చేసుకున్నామన్నారు. ప్రభుత్వం మళ్లీ ఈ విధానాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు జోగినాయుడు, సీహెచ్‌జే ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● డీఎస్సీలో అప్రంటీస్ విధానాన్ని విరమించుకోవాలని ఆప్తా రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ ఉత్తుత్తి ప్రకటనలు చేసిందని, ఎన్నికల ముందు అరకొర ఖాళీలతో ప్రకటన చేయడం సరికాదన్నారు.

నగర పాలక సంస్థ సహాయ కమిషనర్‌గా తిరుమలరావు

విజయనగరం రింగురోడ్డు: నగర పాలక సంస్థ సహాయ కమిషనర్‌గా సీహెచ్ తిరుమలరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు నుంచి బదిలీపై వచ్చారు. తొలుత పైడిమాంబను దర్శించుకున్నారు. ఈయనకు నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

బొబ్బిలి కమిషనర్‌గా రామలక్ష్మి

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ కమిషనర్‌గా ఎల్.రామలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ సత్తారు శ్రీనివాసరావుకు విశాఖ జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయిన సంగతి తెలిసిందే. నూతన కమిషనర్ రామలక్ష్మి మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావును, ఇతర ప్రతినిధులనుకలుసుకున్నారు. మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, కౌన్సిలర్లు ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు.

చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం

● జయహో బీసీ సదస్సులో టీడీపీ నాయకులు



కొత్తవలస, కురుపాం: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు పాశర్ల ప్రసాద్, వీరేష్ చంద్రదేవ్

టీడీపీ అధినేత చంద్రబాబుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని పార్టీ నాయకులు అన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు చోట్ల గురువారం టీడీపీ జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ బీసీలు అభివృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించాలని కోరారు.

ప్రత్యేక చట్టం తీసుకువస్తాం

సాలూరు రూరల్: టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకు వస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బాగువలసలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశు ఆధ్వర్యం లో స్థానిక పార్టీ నాయకుడు శ్యామ్ పర్యవేక్షణలో జయహో బీసీ సదస్సు గురువా రం నిర్వహించారు. ఈ సభలో ఆమె మాట్లాడుతూ జగన్ దొంగ అని సొంత చెల్లి షర్మిలయే చెబుతున్నారని అన్నారు. సాలూరులో రెండు లక్షల ఓట్లు ఉంటే 1.25 లక్షల ఓట్లు బీసీలేవన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడు తూ చంద్రబాబు బీసీలకిచ్చిన ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముఖీసూర్యనారాయణ, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, నేతలు నిమ్మాది తిరుపతిరావు, గుళ్ల వేణుగోపాలరావు, వెంకటరావు రామసాయి, గౌరీ శంకరరావు, శ్రీనివాసరావు, బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం

దత్తిరాజేరు: బీసీలకు టీడీపీతోనే సముచిత స్థానం సాధ్యమని పార్టీ గజపతి నగరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఏ నాయుడు అన్నారు. పెదమానాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబు పాలనలో బీసీలతో ఎంతో మేలు జరిగింద న్నారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యకు భూ కబ్జాలపై ఉన్న శ్రద్ధ.. బీసీలపై ఉందా.. అని ఆయన విమర్శించారు. బీసీ రిజర్వేషన్ టీడీపీ హయాంలో 34శాతం ఉంటే వైసీపీ ప్రభుత్వం వచ్చి దానిని 24 శాతానికి కుదించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బండారు బాలాజీ, క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి మహేష్, పెద్దింటి జగన్, వేమలి చైతన్యబాబు, బీసీ నియోజకవర్గ నాయకులు చెల్లూరి సత్యారావు, అల్లు విజయ్ కుమార్, తాడ్డి రవి, పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు న్యాయం

కొత్తవలస: టీడీపీ హయాంలోనే బీసీలకు తగిన న్యాయం జరిగిందని విశాఖపట్టణం పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు తమ్మిన విజయ్‌కుమార్, అన్నూరి మధు, బొబ్బిలి అప్పారావు అన్నారు. గురువారం కొత్తవలసలోని పార్టీ కార్యాలయంలో ఎస్.కోట టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు సంబంధించిన అన్ని పథకాలూ రద్దయ్యాయని, కార్పొరేషన్ పేరు చెప్పుకుని నిధులు తెచ్చుకుని స్వాహా చేసిన ఘనత వైసీపీకి దక్కుతుందన్నారు. నాయకులు గోడి నరసింహాచారి, గంటా నూకరాజు, కవిత, గూనేల అంజలీదేవి, రాణితిక్కాన చినదేముడు, కోళ్ల వెంకటరమణ, బంగారు రమేష్, పీవీ రత్నాజీ, కనకాల శివ, నక్కరాజు చిన రాము, కొరుపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై దాడులు ఎక్కువయ్యాయి

కురుపాం: కురుపాంలో గురువారం టీడీపీ జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. నియోజవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా చంద్రదేవ్ మాట్లాడుతూ గతంలో బీసీల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎన్నో జీఓలు తెచ్చి అభివృద్ధి చేస్తే వైసీపీ హయాంలో బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఇప్పటికైనా బీసీలంతా ఏకమై వైసీపీ ప్రభుత్వాన్ని గద్దిదించాలని అన్నారు. టీడీపీ, జనసేన, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఓటునూ పరిశీలించాలి

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి



మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు: సాలూరు నియోజకవర్గంలోని 243 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ప్రతి ఓటూ ముఖ్యమని, ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సాలూరు పట్టణంలోని తన నివాసం వద్ద ఆమె ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రాన్ని సెల్‌ఫోన్‌లో ఎలా చూడాలి, అందులో ఉన్న ఓట్లను ఎలా పరిశీలించాలి అనే విషయాన్ని పార్టీ బూత్ ఇన్‌చార్జిలకు వివరించారు. ఇప్పటికే అనేక ఓట్లను పరిశీలించి, ఆన్‌లైన్‌లో చూపించిన పలువురు ఇన్‌చార్జిలను ప్రశంసించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బూత్ ఇన్‌చార్జిలు ఓట్ల పరిశీలన ప్రక్రియ, చేర్పులు, తొలగింపులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పాచిపెంట, సాలూరు, మక్కువ, మెంటాడ పార్టీ అధ్యక్షులు ప్రసాద్ బాబు, పరమేష్, వేణు, వెంకటరమణ, మావుడి ప్రసాదరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న కృష్ణమూర్తినాయుడు

వీరఘట్టం: టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరఘట్టం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అరకు పార్లమెంటరీ పార్టీ బీసీసెల్ కన్వీనర్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంబర, రాజపురం, చిదిమి రహదారులకు గత ప్రభుత్వంలోని టెండర్లు పిలిచారని అన్నారు. ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదన్నారు. తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకీకరణ నత్తనడకన సాగుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉదయాన ఉదయభాస్కర్ మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమం విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. జామి లక్ష్మీనారాయణ, అనీల్‌కుమార్, ఉమా పాల్గొన్నారు.

వైసీపీ పతనం ప్రారంభం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ



ద్విచక్ర వాహనంతో ర్యాలీ చేస్తున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట రూరల్: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ అన్నారు. గురువారం వివిధ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలను కలుసుకొని ఈ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను వివరించారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేసిన విధానం, ధరల పెంపు, ఏటా ఉద్యోగాల పేరుతో యువతకు చేసిన మోసాలను వివరించారు. పొలాల్లో పనిచేస్తున్న మహిళలను కలిసి టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విధానాలతో రాష్ట్రం సర్వనాశనం

చీపురుపల్లి: వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్ర సర్వనాశనం అయ్యిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. గుర్ల మండలం జమ్ముపేట గ్రామానికి చెందిన పలు కుటుంబాలు గురువారం టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చీపురుపల్లి నియోజకవర్గ అభివృద్ధిని మంత్రి గాలికొదిలేశారన్నారు. ఈ కార్యక మంలో పార్టీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, చనమల మహేశ్వర రావు, కురిమినెల్లి బంగారు నాయుడు, శ్రీను, కిలారి సూర్యనారాయణ, మండల అప్పల నాయుడు, కిత్తంనాయుడు, గోవింద, నాగులాపల్లి నారాయణరా వు, శివ తదితరులు పాల్గొన్నారు. ● **మెరకముడిదాం:** మండల కేంద్రమైన మెరకముడిదాంలో ఉన్న టీడీపీ కార్యాలయం లో పులిగుమ్మి గ్రామానికి చెందిన 20 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, చీపురుపల్లి నియోజవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో తాడ్డి సన్యాసినాయుడు, కెంగువ ధనుంజయ, మండల రమణ, మోహన్‌రావు, పిన్నింటి సన్యాసి నాయుడు, సుబ్బరాజు ,నానిరాజు, రమణరాజు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

● ఎండీఎం నిర్వాహకుల ఆందోళన ● 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా ● అధికారులకు వినతిపత్రం అందజేత



గరుగుబిల్లి, సీతంపేట: విద్యా శాఖాధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎండీఎం నిర్వాహకులు

గరుగుబిల్లి/ సాలూరు/ సీతంపేట: కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు గురువారం ఆందోళన చేశారు. సంఘ యూనియన్ నాయకులతో కలిసి ఎంఈవోల వద్దకు వెళ్లి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలను పెంచాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ బాధ్యత కల్పించాలన్నారు. ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 5న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు.

అర్హులకు పింఛన్లు అందేదెప్పుడు?



మాట్లాడుతున్న సత్యనారాయణ

గరుగుబిల్లి: ప్రభుత్వ పథకాలకు అర్హత ఉన్నా అందని పరిస్థితి ఏర్పడిందని నాగూరు ఎంపీటీసీ సభ్యులు, అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో విలేఖరులతో మాట్లాడుతూ వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు అర్హులైన వారికి మంజూరు కాలేదన్నారు. నిబంధనల మేరకు దరఖాస్తులను సంబంధిత సచివాలయాల్లో నమోదు చేశారని, సామాజిక తనిఖీలు జరిగాయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్నవారికి పథకాలు అందిస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. నిబంధనల మేరకు పింఛన్లు మంజూరు చేయకుంటే మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు బొంగు నారాయణస్వామి, కండేన బలరాంనాయుడు, అక్కేన నారాయణరావు పాల్గొన్నారు.

పిల్లల్లో నులిపురుగుల నివారణకు చర్యలు

● డీఎంహెచ్‌వో జగన్నాథరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పార్వతీపురం,(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో నులి పురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో జగన్నాథరావు ఆదేశించారు. గురువారం వైద్య ఆరోగ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీ నుంచే డీవార్మింగ్‌డే కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. 19 సంవత్సరాల లోపు పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా ఆ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఆయా చోట్ల ఏడాది నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలు, విద్యార్థుల వివరాలను ఆరోగ్య కార్యాలయానికి విధిగా అందజేయాలని తెలిపారు. నేత్ర సమస్యలున్న 792 మందికి ఈ నెల 1 నుంచి 15 వరకు శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి, విజయనగరం పుష్పగిరి, విశాఖ శంకర్ ఫౌండేషన్లలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని, నిర్దేశించిన తేదీల ప్రకారం వారిని సిద్ధం చేయాలని ఆదేశించారు. చిన్నారులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందించాలని సూచించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని తరచూ పర్యవేక్షించాలని చెప్పారు. జిల్లాలో మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డి.భాస్కరరావు, జిల్లా అంధ నివారణాధికారి సుకుమార్‌బాబు, డీఎంవో టి.జగన్మోహన్‌రావు, ప్రోగ్రాం అధికారి వినోద్‌కుమార్, డీపీహెచ్ఎన్‌వో ఉషారాణి, ఆప్తాలమిక్ ఆఫీసర్ నగేష్‌రెడ్డి, ఏఎంవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి తలుపులు ఏర్పాటు



తలుపులు ఏర్పాటుచేసిన దృశ్యం

సీతంపేట: సీతంపేటలోని ఏరియా ఆసుపత్రి దుస్థితిపై ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'అట్టలే తలుపు' పేరిట కథనం ప్రచురితమయ్యింది. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు స్పందించి తలుపులు ఏర్పాటు చేశారు. దీనిపై సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తలుపులు వినియోగంలోకి రావాల్సి ఉంది.



భారీ వాహనంతో నిలిచిన ట్రాఫిక్

వీరఘట్టం: పట్టణంలోని ఒట్టిగెడ్డ బ్రిడ్జిపైన భారీ వాహనం రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ వాహనం కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలకు స్థలం లేకపోవడంతో బ్రిడ్జి మధ్యలోనే ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. కొద్ది సమయం తర్వాత పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలు రాకపోకలు సాగేలా చేశారు.



రోడ్డుపై నిలిచిన వాహనాలు

రహదారి భద్రతా నియమాలు పాటించండి

సాలూరు: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ఎస్ ప్రసాద్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, రహదారి భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ జీడీ బాబు, అగ్నిమాపక అధికారి సూధాకర్‌తో పాటు లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఇండుపూరి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

బొండపల్లి: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గజపతినగరం అగ్నిమాపక కేంద్రం అధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ పేర్కొన్నారు. బోడసింగిపేటలో గల సాయిసిద్ధార్థ కాలేజీలో గురువారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి పరామర్శ

రాజాం: సంతకవిటి మండలం పోతురాజుపేట గ్రామానికి చెందిన జనసైని కుడు పోతురాజు నీలంనాయుడు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను రాజాం జనసేన పార్టీ సమన్వయకర్త ఎన్నిరాజు గురువారం పరామర్శించారు. పార్టీ తరుపున అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హరి, అన్నంనాయుడు, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



